
# జిలేబి



వంశీ

'అద్దాల మేడలో అందాల భామ వుంది'
అద్దాల బండిలో తియ్యటి జిలేబి వుంది' అంటూ తియ్యటి కూనిరాగం తీస్తున్నాడు భద్రయ్య

గుండ్రంగా చుట్టలు చుట్టి ఎత్తుగా పేర్చిన తేనెరంగు జిలేబీ మిఠాయి బండిలో వుంది భద్రయ్య నోరూరిస్తోంది.'

అది తన నోట్లో పడే వుపాయం ఏమిటా అని ఆలోచిస్తున్నాడు.

పార్టీ ఎవరైనా క్వార్టర్ ఎలాట్‌మెంట్ కోసం రాకపోతాడా! ఆ వచ్చిన వాడితో జిలేబీ కొనిపించకపోతానా అనుకున్నాడు.

కాలం గడిచేకొద్దీ ఎండ తగిలిన మంచుముక్కలా అతని ఆశ నిరాశై పోయింది.

పార్టీ లెవరూ రాకపోవడంవల్ల ఆఫీసులో గుమస్తాలు గూడా కాఫీమాట ఎత్తడంలేదు లేకపోతే ఈపాటికి రెండు మూడుసార్లు కాఫీకి ఆర్డరు ఇచ్చివుండే వాళ్ళు. (బిల్లు పార్టీ ఇస్తాడనుకోండి.)

ఆ ప్రాజెక్టులో కొన్నివేల క్వార్టర్స్ వున్నాయి. వాటిని ఉద్యోగులకు ఎలాట్ చేసి ఆర్డర్స్ ఇచ్చే ఆఫీసు అదే. ట్రాన్స్‌ఫర్ మీద వెళ్ళిపోయే వాళ్ళ

క్వార్టర్స్ ఖాళీచేసి పోతుంటే, కొత్తగా వచ్చినవాళ్ళు ఆ క్వార్టర్స్ కోసం పడిగాపులు కాస్తూ ఆ ఆఫీసు చుట్టూ తిరుగుతూ వుంటారు. అలా వచ్చేవారికి సేవ చెయ్యడానికి భద్రయ్య ఎంతో ఆతృతతో వుంటాడు పాపం. ఆఫీసు జవాను భద్రయ్య ద్వారా క్వార్టర్ కోసం వచ్చినవారికి చిరునవ్వుతో దర్శనమిచ్చి సీనియార్టీ తల్లక్రిందులు చేసి సహాయం చెయ్యడానికి తహతహ లాడుతూ వుంటాడు ఆఫీసు గుమస్తా.

కాని పాపం ఆ రోజు వాళ్ళిద్దరూ ఎవరి ముఖం చూశారో గాని వాళ్ళ జేబుల్లో ఒక్క రాయీ పడలేదు.

కాలం గడిచేకొద్దీ కనిపించని ఎవరి మీదో భద్రయ్యకు చిరాకు కలిగింది. జిలేబీ కలయికకోసం అతని జిహ్వ తహతహ లాడుతోంది.

పోతే పోయింది ఒక అర్ధరూపాయి ఆ బండివాడి ముఖాన కొట్టి జిలేబీ తిందామా! అన్నంత ఆవేశం వచ్చింది భద్రయ్యకి.

కాని అర్ధరూపాయి వాడి ఎదాన కొట్టడమేగాని ఎంత ఇస్తుంది? ఏభై గ్రాములు అంటూ ఒక గులకరాయి త్రాసులోవేసి బంగారంలా తూస్తాడు. నోరు పాడైపోవడం తప్ప ఒక్క పంటి క్రిందకూ రాదుకదా!

ఎవరైనా పార్టీతగిలినప్పుడు తృప్తిగా తినాలి గాని సొంతడబ్బుతో కక్కుర్తి తిండి కడుపు నిండుతుందా?

భద్రయ్యకు కడుపులో వికారంగా వున్నట్లనిపించి సింగిల్ 'టీ' నీళ్ళయినా గొంతులో పోసుకుందామని లేచాడో లేదో ఎవరో పాపం గొడుగు వేసుకుని వస్తూ కనిపించాడు.

'హమ్మయ్య! దేవుడిలా వస్తున్నాడు ఎవరోగాని' అనుకుని స్టూలుమీద కూల బడిపోయాడు భద్రయ్య.

ఆయన తెల్లటి బట్టల్లో బట్టలసబ్బు అడ్వర్టైజ్‌మెంట్ మోడల్‌లా వున్నాడు, బట్టతల నున్నగా ఎండలో అద్దంలా మెరుస్తోంది. ఆయన వయస్సు నలభై పైనే వుంటాయి.

"అయ్యగారున్నారా?" అన్నాడతను వస్తూనే.

"లేరండీ, పెళ్ళికెళ్ళారు." అన్నాడు భద్రయ్య.

ఆ వచ్చిన అతని పేరు శ్రీశైలం. ప్రాజెక్టులో సూపర్‌వైజర్‌గా జేరి మూడునెలలు దాటిపోయింది. పెళ్ళాం, పిల్లలు బెజవాడ ఎండల్లో మాడి పోతున్నాం తీసుకెళ్ళమని వారానికొక రిమైండర్ ఇస్తున్నారు. ఇక్కడ ఈయనకి ఇల్లు ఎలాట్ చెయ్యడంలేదు. పోనీ ఇల్లు అద్దెకు తీసుకుందామా అంటే ప్రైవేట్ ఇళ్ళు లేవు. ఎన్నిసార్లు వచ్చి అడిగినా 'మీ సీనియార్టీ ఇంకా రాలేదు' అంటాడు ఎలాట్‌మెంట్ గుమస్తా.

ఈసారి సరాసరి ఆఫీసరుగారితో మాట్లాడి పోదామని వచ్చాడు.

"అయ్యో! లేరా!" అంటూ శ్రీశైలం నిట్టూర్చాడు.

"ఫరవాలేదులెండి. ఆయన లేకపోతే నేం? మేం లేమా?" ఆప్యాయంగా అన్నాడు భద్రయ్య.

"వున్నారనుకోండి..." అన్నాడు శ్రీశైలం భద్రయ్య వ్యూహం అర్థంకాక.

"గుమస్తాగారితో మాట్లాడి మీకు క్వార్టర్ ఎలాట్‌మెంట్ చేయించే బాధ్యత నాది. తమకు 'ఏ' టైప్ కావాలా? 'బి' టైప్ కావాలా?"

"సీనియార్టీ వచ్చిందా?..." ఆశగా అడిగాడు శ్రీశైలం, తన పేరు ఇక్కడ జాయిన్ అయిన తేదీ వగైరా చెప్తూనే భద్రయ్య చిన్నగా నవ్వి "సీనియార్టీతో పనేముంది సార్? తమకు తెలియంది ఏముంది? ..." అంటూ ఎత్తుగా కన్పిస్తున్న శ్రీశైలం జేబువంక చూశాడు.

శ్రీశైలానికి భద్రయ్య భావం అర్థమై పోయింది. "అలాగే...అదెంత భాగ్యం. ఎలాట్‌మెంట్ ఆర్డర్స్ ఇవ్వాలి గాని. నా ఫామిలీ బెజవాడలో, నేనేమో ఇక్కడ వస్తున్నాననుకో," అన్నాడు.

భద్రయ్య ఆలోచించాడు ఒక్క క్షణం గుమస్తాకి వంద, తనకి పాతిక. గుమస్తాకి ఏభై, తనకి పది. ఛా... మరీ తక్కువ. గుమస్తాకి రెండొందలు తనకి ఏభై...

ఏదీ ఒక అంకె కుదరడంలేదే. పని పూర్తవక ముందే ఆ అంకె ఏదో తేల్చుకుని అడ్వాన్సు తీసుకోవాలి. లేకపోతేనా పోతూ ... పోతూ ... కాఫీ తాగవోయ్ భద్రయ్యా అంటూ పావలా చేతిలో పెట్టేరకం.

"కాస్త తలనొప్పిగా వున్నట్లుంది శ్రీశైలంగారూ! కాస్త కాఫీ వేసుకుందామా?..." అన్నాడు భద్రయ్య.

"అయ్యో! కాఫీకేం భాగ్యం పదండి. అసలు నేనే అనాల్సింది..." అంటూ దారితీశాడు శ్రీశైలం.

'కాఫీ' అని పైకి అన్నాడుగాని జిలేబి తినాలని భద్రయ్య జిహ్వ తెగ తాపత్రయ పడిపోతోంది.

"శ్రీశైలంగారూ ఈ బండిలో జిలేబి వుంది చూశారూ. భలే రుచిగా వుంటుంది. నోట్లో వేసుకుంటే కరిగిపోతుందనుకోండి."

"అలాగా..." అన్నాడు శ్రీశైలం పైకి. పీక్కుతింటారు ఏదైనా పనిమీద వస్తే చాలు అనుకున్నాడు లోలోపల.

"ఏవోయ్ శేటూ, చెరొక వంద గ్రాములూ ఇవ్వు," అంటూ ఆర్డరు చేశాడు భద్రయ్య.

"పీడి బాబుగాడిసొమ్ము దాచిపెట్టినట్లు ఎంత దర్జాగా ఆర్డర్ ఇస్తున్నాడో పీనుగ వెధవ' శ్రీశైలంగొణుక్కున్నాడు

"నాకెందుకూ. మీరు తీసుకోండి," అన్నాడు.

"అలాగనకండి శ్రీశైలంగారూ. ఈ రోజు మీరు జిలేబీ రుచి చూడ వలసిందే ఒక్కసారి తిన్నారంటే మళ్ళీ మళ్ళీ జిలేబికోసం మా ఆఫీసుకు రావల్సిందే. అంత బాగా చేస్తాడు మా శేటు. ఏంవాయ్ శేటూ "

బండివాడు నవ్వుతూ చెరొక [illegible]ంద గ్రాములూ తూచి కాగితాల్లో పెట్టి ఇచ్చాడు.

శ్రీశైలం జి[illegible]బీ నోట్లో వేసుకున్నాడు.

"మంచిది భద్రయ్యగారూ. మీరు చేసిన సహాయానికి ధన్యవాదాలు. ఆఫీసర్‌గారు వచ్చాక కలుసుకుంటాను." అన్నాడు వెళ్ళబోతూ.

భద్రయ్య అయోమయంగా చూశాడు.

"అదేంటి సార్. ఆఫీసర్‌గారు లేకపోతేనేం? వుంటేనేం? అంతా గుమస్తా గారి చేతిలోనే వుంది. మీ అప్లికేషన్ బయటకు తీయించి మీ 'ఏ' టైప్ ఇలు చూపించకపోతే నా పేరు భద్రయ్య కాదు."

శ్రీశైలం నవ్వాడు.

నా అప్లికేషన్ ఎప్పుడో బయట పడింది" అన్నాడు.

భద్రయ్య అర్థంగాక శ్రీశైలం వంక ఎగాదిగా చూశాడు.

"నేను క్వార్టర్ కోసం పెట్టిన అప్లికేషన్‌లో జిలేబీ పెట్టియిచ్చాడు ఈ మిఠాయి బండివాడు," అంటూ తన చేతిలోని కాగితం భద్రయ్యకు చూపించాడు శ్రీశైలం.

భద్రయ్య గుండెల్లో రాయిపడింది ఎవరో క్రూరతో నెత్తిన కొట్టినట్లు స్థాణువై నిల్చుండిపోయాడు.

"లంచం ఇవ్వకపోతే మీరు క్వార్టర్స్ ఎలాట్ చెయ్యర్న మాట. అప్లికేషన్లు చెత్తకాగితాలుగా మిఠాయి వాడికి అమ్ముకుంటున్నారన్న మాట. సరే చూస్తాను" అంటూ విసురుగా వెళ్ళిపోయాడు శ్రీశైలం.

* * *

క్వార్టర్స్ ఎలాట్ చేసినందుకు లంచం తీసుకుంటూ వుండగా గుమస్తాను అవినీతి ఆరోపణపై అరెస్ట్‌చేసి ఉద్యోగం నుంచి సస్పెండ్ చేశారని, ఆఫీసు కాగితాలు మిఠాయిబండివాడికి అమ్ముకున్నందుకు జవాన్‌ని వుద్యోగంనుంచి పంపివేశారనీ తర్వాత పేపర్లో ఒక వార్త పడింది.

ఇప్పుడు భద్రయ్య మిఠాయి బండి నెట్టుకుంటూ వీధుల్లో కన్పిస్తున్నాడు.

"జిలేబీ నా కొంప తీసింది," అంటూ సన్నిహితులకు జరిగిన కథ చెప్తూ వుంటాడు భద్రయ్య.